ప్రజాశక్తి
మంగళవారం 12 మార్చి 2024
5
విజయనగరం



16న జాతీయలోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

విజయనగరం, పార్వతీపురం మన్యం ఉమ్మడి జిల్లాల్లోఈనెల 16న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో బ్యాంకులకు సంబంధించిన కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, సెక్షన్ 138 ఎన్ఐ యాక్ట్‌కు సంబంధించిన కేసులు, ఎక్సైజ్ కేసులు, మోటార్ ప్రమాద భీమాకేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక సంబంధిత కేసులు, విద్యుత్, నీటి పన్నుకు సంబంధించిన కేసులు, భూ సేకరణకు సంబంధించిన కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. పూల్‌బాగ్ కాలనీ హనుమన్ నగర్‌లోని నూతన కోర్టు భవనంలో 16న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





విజయనగరం, గరివిడి స్టేట్‌బ్యాంకుల వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే వెల్లడించాలి

స్టేట్‌బ్యాంకు కార్యాలయాల వద్ద సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే వెల్లడించాలని డిమాండ్‌చేస్తూ కోట జంక్షన్ వద్ద గల స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద సిపిఎం ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ దేశంలో పెట్టుబడి దారుల నుంచి వేలకోట్ల రూపాయలను బాండ్ల రూపంలో బిజెపి తీసుకుని రాబోయే ఎన్నికలలో ప్రజలకు పంపిణీ చేసి లబ్ధిపొందేందుకు కుట్ర చేస్తున్నదని అన్నారు. అందులో భాగంగానే ఎస్ బిఐ లో ఎన్నికల బాండ్ల వివరాలు పబ్లిక్ డొమైన్‌లో లేకుండా చేశారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయకుండా రాజ్యాంగానికి విలువ ఇవ్వని బిజెపి ప్రభుత్వ తీరుని ప్రజలంతా ఖండిచాలని కోరారు. ఎన్నికల బాండ్ల సేకరణ రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించిన సుప్రీంకోర్టు ఆ బాండ్లు ఎవరెవరు కొన్నారు, ఎవరికి ఇచ్చారు అనే అంశాలతో పూర్తి వివరాలను మార్చి 6లోగా ఎన్నికల సంఘానికి నివేదించాలని స్టేట్‌బ్యాంకును ఆదేశించినా అమలు చేయలేదన్నారు. గడువు ముగిస్తున్నా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించకుండా నాటకాలు ఆడుతున్నదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకముందు ఈ వివరాలు వెల్లడిస్తే బిజెపికి కార్పొరేట్ కంపెనీల నుంచి ఎన్ని వేల కోట్లు అందాయో బట్టబయలు అవుతుందని అన్నారు. తక్షణమే ఎన్నికల బాండ్ల ఫ్రీజ్ చెయ్యాలనీ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఎన్నికల బాండ్లకు సంబంధించి వివరాలను ఎస్‌బిఐ అందజేసేలా సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని .వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి. రమణ. సిఐటియూ కార్యదర్శి యు ఎస్ రవికుమార్, త్రినాథ్, నాయకులు హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బిఐ వెంటనే వెల్లడించాలని కోరుతూ స్టేట్‌బ్యాంకు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. శంకర్రావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఒత్తిడి కారణంగానే ఎస్‌బిఐ వివరాలు వెల్లడించకపోవడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎస్. గోపాల్, ఎ.సురేష్, మణికుమార్, పి. అప్పారావు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంగర : ఎన్నికల బాండ్ల వివరాలును వెంటనే ఎస్ బి ఐ వెల్లడించాలని కోరుతూ రాజాంలోని ఎస్‌బిఐ బ్రాంచి వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వంజరాపు తిరుపతి, పొరెడ్డి విశ్వనాథం, మడపాన త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎస్‌బిఐ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వెంటనే ఆ వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు ఎ.గౌరినాయుడు, జె.విశ్వనాధరాజు, సేనాపతి పాపినాయుడు, కరణం సన్యాసినాయుడు, తాళ్లపూడి సత్యం తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో స్టేట్‌బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

కెజిబివిల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని కస్తురిభాగాంధీ బాలికా విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ ఎన్.ప్రేమ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు వివిధ కెజిబివిలలో 7,8, 9వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుండి ఏప్రిల్-11వ తేదీ లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథలు, బడి బయట విద్యార్థులు, పేద ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనారిటీ దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న బాలికలు మాత్రమే ప్రవేశానికి అర్హులని తెలిపారు. దరఖాస్తును https://apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో పంపాలని తెలిపారు. సంబందిత పాఠశాలల ప్రిన్సిపాళ్లను కూడా వివరాలు అడిగి తెలుసు కోవచ్చునన్నారు. సందేహాలకు రాష్ట్ర టోల్‌ఫ్రీ నెంబరు 18004258599ను సంప్రదించవచ్చునని ప్రకటన ద్వారా తెలిపారు.

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ప్లాట్లకు లాటరీ

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్స్‌లో ఇళ్ల స్థలాల కేటాయింపునకు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం లాటరీ ప్రక్రియ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డెంకాడ మండలం రఘుమండ, బొండపల్లి మండలం జిఎన్‌వలస వద్ద జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌ను విఎంఆర్‌డిఎ రూపొందించిన విషయం తెలిసిందే. ఈ టౌన్ షిప్‌లో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మూడో విడతగా కంప్యూటర్ ద్వారా లాటరీ తీసి ప్లాట్లను కేటాయించారు. ఆయా కేటగిరీలకు వచ్చిన దరఖాస్తులను బట్టి 150, 200 గజాల ప్లాట్లను లాటరీ ద్వారా ఖరారు చేసి, కేటాయింపు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ తర్నకుమార్, వికెపిసిపిఐఆర్ జాయింట్ డైరెక్టర్ శిల్ప, విఎంఆర్‌డిఎ అధికారులు పాల్గొన్నారు.

13న లబ్ధిదారులతో ప్రధాని ముఖాముఖి

విజయనగరం : జాతీయ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు పథకాల లబ్ధిదారులతో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 13న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ముఖాముఖి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 4గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ప్రజప్రతినిధులు, కేంద్రం నుంచి నోడల్ అధికారి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ కార్డులు, సఫాయి కర్మచారీలకు పిపిఇ కిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



జాతర పోస్టర్ విడుదల చేస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్‌పి చంద్రశేఖర్, ఆర్‌డిఒ తదితరులు

17 నుంచి కనకమహాలక్ష్మి జాతర

పండగను విజయవంతం చేయండి : జెడ్‌పి చైర్మన్, ఎంపి

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఈనెల 17, 18, 19 తేదీలలో జరగనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను ప్రజలంతా జయప్రదం చేయాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ కోరారు. అధికారులు, ఆలయ కమిటీ, ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయంతో పని చేసి జాతరను విజయవంతం చేయాలని సూచించారు. జాతరను పురష్కరించుకొని సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతర జరిగే మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. పారిశుధ్యం విషయంలో ఎప్పటికప్పుడు పంచాయతీతో పాటు ఆలయ పరిసరాలలో కూడా శుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జాతరకు సంబంధించిన గోడ పత్రికలను వారు విడుదల చేసారు. ఆలయ ఇఒ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆలయ కమిటీ ఛైర్మన్ సూర్య ప్రకాశరావు, వైస్ ఛైర్మన్ సూరుకుమార్, ఆలయ కమిటీ సభ్యులు కంది శ్రీరాములు, రేగిడి అప్పలనాయుడు, అడ్డూరి సీతబాబు, ఋంగ కనకరాజు, ఎం.రవికుమార్, వంకల కృష్ణ, గ్రామ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఆర్‌డిఒ బి.శాంతి, తహాశీల్దారు ఎన్.సురేష్, సిఐ సిహెచ్ షన్ముఖరావు, ఎస్ఐ కెకెకె ఆర్ నాయుడు, వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మంగళగిరి శ్రీనివాసరావు, ఎస్‌వి కామేశ్వరరావు, ఎస్‌విజి శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఫిర్యాదు దారులకు తక్షణ న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎఎస్‌పి అస్మా ఫర్హీన్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలోచర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం మొత్తంగా 22 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో విజయనగరం డిటిసి డిఎస్‌పి వీరకుమార్, డిసిఆర్బి సిఐ జె. మురళి, డిటిఆర్ ఎస్ఐ ప్రభావతి, డిసిఆర్‌బి ఎస్ఐ గణేష్, తదితరులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎఎస్‌పి అస్మా ఫర్హీన్



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కోలగట్ల

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 27వ డివిజన్ రెల్లి వీధిలో నూతనంగా ఏర్పాటుచేసిన సామాజిక భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామితో కలిసి రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్ రావు ప్రారంభించారు. రూ.36 లక్షలతో ఏర్పాటు చేసిన సామాజిక భవనం తమ వర్గ ప్రజలకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని మధుసూదనరావు అన్నారు. ఇటీవల లంకాపట్నం లో రూ.80 లక్షలతో సామాజిక భవనాన్ని నిర్మించి తమ వర్గానికి అందించగా, తాజాగా రూ.36 లక్షలతో సామాజిక భవనాన్ని మరో భవన అభివృద్ధి పనులను పూర్తి చేసి అందించడం అభినంద నీయమని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత, మాజీ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు ప్రారంభం

నగరంలోని 29వ డివిజన్ మహాలక్ష్మి నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన 3 సిసి రహదారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ సమస్యలేని నగరంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అనేక విధాల కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు ఈశ్వర్ కౌశిక్, అచ్చిరెడ్డి, నాగిరెడ్డి ,గుణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గజపతినగరం, బొబ్బిలి

బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను, రిసెప్షన్ సెంటర్లను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం పరిశీలించారు. బొబ్బిలి ఆర్‌డిఒ కార్యాలయాన్ని, మెట్టపల్లి ప్రభుత్వ పాఠశాలను, గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన వసతులను తనిఖీ చేశారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, నేమ్ బోర్డులు, ర్యాంపులను పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్‌కు అవసరమైన కౌంటర్లు, పార్కింగ్, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా రిసెప్షన్ సెంటర్ కు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలూ పనిచేసేవిధంగా కాల్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వీడియో రికార్డింగ్ చేసేందుకు అవసరమైన వీడియో గ్రాఫర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ సిబ్బందికి అన్ని విధాలా శిక్షణ పూర్తి చేయాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు, విఆర్‌ఒలు, ఎన్‌సిసి సిబ్బందికి కూడా తగిన శిక్షణ పూర్తి చేయాలన్నారు.

మెట్టపల్లి పాఠశాలలో మరుగుదొడ్లను వెంటనే మరమ్మతు చేయించాలని, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే లోగానే ఏర్పాట్లు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యటనలో బొబ్బిలి ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, బొబ్బిలి తాహశీల్దార్ త్రినాధరావు నాయుడు, గజపతినగరం తాహశీల్దార్ రమేష్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గజపతినగరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి




పట్టాలు తప్పిన బోగీలను ట్రాక్‌పైకి ఎక్కిస్తున్న రైల్వే సిబ్బంది

రైల్వేట్రాక్ పునరుద్ధరణ

పరిశీలించిన డిఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలో ఆదివారం రాత్రి విశాఖపట్నం - భవానిపట్నం పాసింజర్ రైలు పట్టాలు తప్పిన నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన రైలేట్రాక్ పునరుద్దరణ పనులు సోమవారం మధ్యాహ్నానికి పూర్తి చేసి బోగీలను పట్టాలెక్కించారు. సంఘటనా స్థలాన్ని విశాఖపట్నం రైల్వే డిఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ పరిశీలించారు. సంఘటనకు దారి తీసిన కారణాలపై నిపుణులతో చర్చించారు. రైల్వే సిబ్బంది సుమారు 14గంటల పాటు శ్రమించి పట్టాలు తప్పిన ఇంజన్‌ను, బోగీలను ట్రాక్‌లపైకి ఎక్కించారు. ఈ పనులను డిఆర్‌ఎం సోమవారం తెల్లవారు జామునుంచి దగ్గరుండి పర్యవేక్షించారు. హై టెన్షన్ విద్యుత్ తీగలు పైన ఉండటంతో మాన్యువల్ పద్ధతిలో హైడ్రాలిక్ జాకీలను వినియోగించి సుమారు 14 గంటల పాటు రైల్వే శాఖ వివిధ విభాగాల వారు శ్రమించి ట్రాక్ పునరుద్ధరణకు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నంకి లైన్ క్లియర్ చేసి రైళ్లను ఆ లైన్‌లో యథావిధిగా నడిపారు. ప్రమాదానికి కారణాలపై రైల్వే ఉన్నతాధికారులు ఆరా తీశారు.



డిఆర్‌ఒకు వినతినిస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలి

జెసి, డిఆర్‌ఒలకు ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ (ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, కలెక్టర్ తరపున డిఆర్‌ఒ ఎస్‌డి అనితలను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల రెండో విడతలో కూడా జర్నలిస్టులు దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు. వెంటనే మండల, జిల్లా స్థాయిలో జాబితాను సిద్ధంచేసి స్థలాలను గుర్తించాలని కోరారు. త్వరలో ఎన్నికల నోఫికేషన్ వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. స్థలాల ధరలు కూడా నిర్ణయించి ముందుగా తెలియజేస్తే తప్ప జర్నలిస్టులు అప్పటికప్పుడు చెల్లించుకునే పరిస్థితి లేదని తెలిపారు. ప్రైవేటు స్థలాలను కొనే పరిస్థితి లేకుండా ప్రభుత్వ స్థలాలను మాత్రమే గుర్తించాలంటూ ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని, అందుకనుగుణంగా ప్రక్రియను వేగవంతం చేస్తామని జెసి కార్తీక్ హామీ ఇచ్చారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల స్థలాల ప్రక్రియ ముందుకు నడిపేందుకు కృషి చేస్తానని డిఆర్‌ఒ స్పష్టం చేశారు. సి-సెక్షన్ సూపరింటెండెంట్‌ను కూడా పిలిచి అక్కడికక్కడే సమీక్ష చేశారు. వినతిపత్రాలు అందజేసినవారిలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సింహాదాడి మురళీశంకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రొంగలి సూరిబాబు, బి.ప్రసాదరావు, జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు, జిల్లా నాయకులు బాబూరావు, జి.సూరిబాబు, జైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరి వీడాలి

ఉద్యోగులను, కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదు : సిఐటియు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరితో ఉద్యోగులు కార్మికులను ఇబ్బందులు పెట్టడం భావ్యం కాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరసన 40వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సి ఐ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరితో ఉద్యోగులు, కార్మికులకు జనవరి జీతాలు, డిఎ బకాయిలు ఇవ్వకుండా,, వేతన ఒప్పందం చేయకుండా ఇబ్బంది పెడుతోందని అన్నారు. పని చేసిన కాలానికి జనవరి నెల జీతాలు ఇంతవరకు ఇవ్వకపోవడం అన్యాయ మన్నారు. కాబట్టి ప్రభుత్వం, ప్రజ ప్రతినిధులు స్పందించి మిమ్స్ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకు వచ్చి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శిబిరానికి విశ్వ బ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్, 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, నాయకులు పాండ్రంకి సత్య నారాయణ, కాళ్ళ మహేష్ మద్దతు తెలిపారు. శిబిరంలో సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామరావు, ఉద్యోగులు ఎం.నారాయణ, గౌరి,మూర్తి, అప్పల నాయుడు, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

13 మంది అరెస్టు, విడుదల

40 రోజులైనా ఉద్యోగులు ఆందోళన కొనసాగిస్తున్న నేపథ్యంలో యాజమాన్యం కుట్రపూరిత వైఖరి అవలంభిస్తోంది. అందులో భాగంగానే మిమ్స్‌ను ముట్టడిస్తారంటూ పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చి సోమవారం వేకువ జామున సిఐటియు నాయకులు తమ్మినేని సూర్య నారాయణ, టివి రమణ సహా 13 మంది ఉద్యోగులను అరెస్టు చేయించింది. వారందరినీ పోలీసులు పూసపాటిరేగ పోలీసుస్టేషన్‌కు తరలించి, సాయంత్రం విడిచిపెట్టారు.



పూసపాటిరేగ స్టేషన్‌లో ఉన్న మిమ్స్ ఉద్యోగులు, సిఐటియు నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్యారీ సుగర్స్ ఉపాధ్యక్షులు పట్టాభిరామ్‌రెడ్డి

16తో చెరకు క్రషింగ్ పూర్తి

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారీ సుగర్స్ చెరకు క్రషింగ్ ఈనెల 16తో ముగియనుందని ఆ సంస్థ సీనియర్ ఎవిపి పట్టాభిరామ్ రెడ్డి తెలిపారు. సోమవారం సుగర్ ఫ్యాక్టరీ సమావేశ ఛాంబర్లో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 2023-24 ఏడాదికి సంబంధించి చెరకు క్రషింగ్ ఈనెల 16 సాయంత్రానికి పూర్తవుతుందని వెల్లడించారు. చెరకు సరఫరా చేయని రైతులు ఇంకా మిగిలి ఉంటే డివిజన్ స్థాయిలో సిడిఒలు, నేరుగా కటింగ్ ఆర్డర్లకు వస్తే ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈఏడాది చెరకు క్రషింగ్ నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా సోమవారం నాటికి 3.72 లక్షల మెట్రిక్ టన్నులు చెరకు క్రషింగ్ పూర్తి చేసామన్నారు. ఈనెల 16నాటికి 3.87 లక్షల మెట్రిక్ టన్నులు పూర్తి చేస్తామని తెలిపారు. వాతావరణం, సాంకేతపరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ లక్ష్యాలు పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లచ్చయ్యపేట సుగర్స్ మూసి వేయడంతో 9,709 మెట్రిక్ టన్నుల చెరకును, భీమసింగి సుగర్స్ నుంచి 6,632 మెట్రిక్ టన్నుల చెరకును ఆడినట్లు తెలిపారు. వచ్చే ఏడాది చెరకు క్రషింగ్ కు 18వేల ఎకరాలు సాగులో ఉందన్నారు. రైతులు మొక్కజొన్న, వరి వైపు దృష్టి సారిస్తున్న నేపథ్యంలో రైతులకు చెరకు పంటలపై అవగాహన కల్పించి చెరకు సాగు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ఏడాది 10.02శాతం రికవరీ రాగా, ఈ ఏడాది ముందుగా చెరకు క్రషింగ్ ప్రారంభంతో 9.24శాతానికి తగ్గిందన్నారు. చెరకు సరఫరా చేసిన రైతులకు వెంటనే బిల్లులు చెల్లించామని తెలిపారు. సమావేశంలో కేన్ జిఎం రాజేంద్రన్, హెచ్‌ఆర్ హెడ్ మేనేజర్ మురళీకృష్ణ, ఫైనాన్షియల్ మేనేజర్ శ్యాం కుమార్ ఉన్నారు.

టిడిపితోనే బిసిల అభ్యున్నతి


మాట్లాడుతున్న తిరుపతినాయుడు

రామభద్రపురం: బిసి కులాల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమవుతుందని విజయనగరం టిడిపి పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు మడక తిరుపతి నాయుడు అన్నారు. బుసాయవలస పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు బిసిలకు పెద్ద పీట వేసి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తుచేశారు. యువకులు, చేతి వృత్తుల వారికి, విద్యార్థులకు బ్యాంక్ ద్వారా రాయితీ రుణాలు అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రస్తుత పాలక ప్రభుత్వం బిసిలను ఆదరించకపోగా నిర్వీర్యం చేసిందని కనీసం వీరి పాలనలో ఒక్క రాయితీ రుణం కూడా పొందలేని దుస్థితి కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించడం తథ్యం అని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి

గంట్యాడ: ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలన్నీ మండల సమాఖ్య ఆధ్వర్యంలో చేయాలని ఎపిసిఎన్ఎఫ్ డిపిఎం ప్రకాష్ అన్నారు. సోమవారం వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో జరిగిన మహిళా సమాఖ్య ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది అందరూ మండల సమైక్య ఆఫీసులో పని చేస్తారని అన్నారు. ప్రతిరోజు చేసే కార్యక్రమాలతో పాటు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ శాఖతో మండల సమాఖ్య ఒప్పందం చేసుకుంది. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు జనని, ఎపిఎం శ్రీనివాస్, సిసీలు, సిబ్బంది, వివోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

నెల్లిమర్ల: బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభలో మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు మురళీ కృష్ణ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని నగర పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు హరిబాబు డిమాండ్ చేశారు. ఆయన మృతికి కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం జరజాపుపేటలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు హరిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన సిద్ధం సభలో విధులు నిర్వహిస్తూ తొక్కిసలాటలో మురళీకృష్ణ మరణించడం బాధాకరమన్నారు. ఆయన భార్యకు వెంటనే ఉద్యోగం ఇవ్వాలని, ఇద్దరు చిన్నపిల్లల చదువు బాధ్యతలను ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాము, శంకర్, ఉమా, శివ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని వైసిపి నాయకులు, కౌన్సిలర్లు డిఆర్ఓ, తహశీల్దార్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్, నగర పంచాయతీ 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, 2వ వార్డు కౌన్సిలర్ మొయిద శ్రీనివాసరావు, 16వ వార్డు కౌన్సిలర్ పి. సత్యవతి మాట్లాడుతూ మిమ్స్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలం, గాంధీ నగర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని కొంత మంది కట్టడాలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిఆర్ఓ అనిత, తహశీల్దార్ ధర్మరాజుకు వినతి పత్రాన్ని అందించారు.

ఓక్లాండ్ విద్యార్థుల ప్రతిభ

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ఓక్లాండ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వేదిక మ్యాథ్స్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు ప్రిన్సిపాల్ సిహెచ్. రవి తెలిపారు. తమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న నడుపూరి దీపిక రాష్ట్ర స్థాయిలోనే ప్రథమస్థానం సాధించగా, ఆరోతరగతి చదువుతున్న నడిపి దుర్గాప్రసాద్ ద్వితీయస్థానం సాధించారని చెప్పారు. ఈ నెల 10వ తేది ఆదివారం రాష్ట్రస్థాయిలో విజయవాడలో ఏర్పాటు చేసిన వేదిక మ్యాథ్స్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో వీరిద్దరు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి అందరిని ఆశ్చర్యపరిచారన్నారు. దీపిక 50 మార్కుల మ్యాథ్స్ పేపరుకు 5 నిమిషాల 5 సెకండ్లలో జవాబులు చెప్పడంతో ప్రథమంగా నిలిచిందన్నారు. దుర్గా ప్రసాద్ తక్కువ సమయంలో జవాబులు ఇవ్వడంతో ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. వీరిని జాతీయస్థాయి వేదిక మాథ్స్ పోటీలకు ఎంపికచేసినట్లు తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంటు డాక్టర్ పాల్ శ్రీనువాసరావు, చైర్మన్ శివనారాయణతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

తహశీల్దార్ హామీతో ముగిసిన దీక్షలు

మెంటాడ: గిరిజన, దళిత నిరుపేదలు గత ఆరు రోజులుగా చేస్తున్న రిలే దీక్షలు సోమవారంతో ముగిసాయి. భూ సమస్యలు పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తానని తహశీల్దార్ ఎస్ దిలీప్ చక్రవర్తి హామీ ఇవ్వడంతో దీక్షలను ముగించారు. లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని కొండపర్తి పరిసర గిరిజనులు సాగుచేస్తున్న భూముల్లో మహమ్మద్ అముముల్లా నీలగిరి చెట్లు నరికి వేతను నిలుపుదల చేస్తామని సాగు భూములలో సర్వే నిర్వహిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారని కౌలు రైతులు సంఘ జిల్లా కార్యదర్శి రాకోటి రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తామారాపల్లి సోములు, సిపిఎం నేతలు మంగళగిరి అప్పలనరసయ్య, సిహెచ్ కృష్ణవేణి, బంగారి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలతో టిడిపి నాయకుల సమావేశం

విజయనగరం కోట: టిడిపి అభ్యర్థి అతిది గజపతి సోమవారం పూల్‌బాగ్‌లోని మంగళవీధి కాలనీలో డ్వాక్రా మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌టిఆర్ టిడిపిని స్థాపించిన తరువాతే మహిళలకు గుర్తింపు వచ్చిందన్నారు, మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించారన్నారు, చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించడం, తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మొట్టమొదటిసారిగా డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళల ఆర్థికాభివద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, నాయకులు వేచలపు శ్రీనివాసరావు, తెలుగు మహిళా కమిటీ సభ్యులు సువ్వారి అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి, చింతల వీరలక్ష్మి, రౌతు పద్మ, సుంకరి సునీత, పద్మలత, సియ్యదూల ఝాన్సీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులు కొనసాగింపు

జామి: మండలంలోని సీతానగరం మధ్యాహ్న బోజన కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని అధికారులు వెనక్కి తీసుకున్నారు. మహిళా నిర్వహకుల మధ్య సమన్వయ లోపం, గొడవలు నేపథ్యంలో నిర్వాహకులను తొలగించాలని యోచించిన అధికారులు తల్లిదండ్రుల కమిటీ సిఫార్సులు మేరకు తొలగించినట్లు ప్రకటించారు. దీంతో ప్రజాశక్తి స్పందించి 'మధ్యాహ్న కార్మికుల పై వైసిపి దాష్టీకం' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన సిఐటియు కార్మికుల తొలగింపుపై ధర్నాకు పిలుపునిచ్చింది. ఇంతలోనే పున్ణ పరిశీలన చేసుకున్న అధికారులు కార్మికులను తొలగింపు చేయమని, వారిని విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే సిఐటియు నాయకులు మద్దిల రమణ, గాడి అప్పారావు ఎంఇఒ జయశ్రీనీ కలిసి సమస్యలు పరిస్కరించాలని, లేని యెడల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న బోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

శారదా కంపెనీలో సేఫ్టీ సెలబ్రేషన్

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి వద్ద శారద కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు సోమవారం సేఫ్టీ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ గెస్ట్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రావు పాల్గొని మాట్లాడారు. కార్మికులు శ్రద్ధతో, క్రమశిక్షణతో మెలగాలన్నారు. కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు సేఫ్టీ తప్పకుండా పాటించాలన్నారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యం నిర్వహించిన సేఫ్టీ కాంపిటేషన్‌పై గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాస్ మోహన్, ఏజీఎం ఈహెచ్ఎస్. సూర్య భాస్కర్, డీజీఎం హెచ్ఆర్. హెచ్.సన్యాసిరావు, ఎంప్లాయిస్ పాల్గొన్నారు

మార్పు రావాలంటే సైకో పోవాలి : కోండ్రు

రాజాం: రాష్ట్రంలో మార్పు రావాలంటే సైకో జగన్ పోవాలని మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. మండలంలోని శ్యాంపురం టిడిపి క్యాంపు కార్యాలయంలో వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన 34 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి కోండ్రు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా కుంటిపడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండ్రంకి భుజంగ రావు, నవిరి శంకర రావు, నవరి రాము, పాండ్రింకి నరిసింహమూర్తి, గవిడి అప్పలనాయుడు, ఉప్పు రాములు నల్ల బారికి రామక్రిష్ణ తదితరులు టిడిపిలో చేరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శంకుస్థాపన చేశారు. సుందరీకరణ పనులకు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద, స్వామివారి వీధి, పాతబొబ్బిలిలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు పని చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ కాలనీలో హెూ పరిశ్రమ యాజమాన్యం నిర్మించనున్న కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్మన్ చెలికాని మురళి, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైసిపిలో 45 కుటుంబాలు చేరిక

స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన 45 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి ఎమ్మెల్యే శంబంగి కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి మద్దతు ఇచ్చి ఓటు వేసి వైసిపిని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.


బొబ్బిలి: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

నూతన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

బొబ్బిలిరూరల్ : మండలంలోని కలవరాయి, అలజంగి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో మండలంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు శంకుస్థాపన చేసి పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వైసిపి నాయకులు వేణుగోపాలనాయుడు, వ్యవసాయ శాఖ ఎడిఎ యం. శ్యాంసుందర్, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, సర్పంచ్ బొత్స నటరాజ్, ఎంపిటిసి పాటూరు సింహచలం, వైసిపి మండల అధ్యక్షుడు ఉత్తరావల్లి అప్పల నాయుడు, మండల జెసిఎస్ కన్వీనర్ దామోదర్ పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రారంభించారు. రామలింగాపురం గ్రామంలో సచివాలయ భవనం, వెల్నెస్ సెంటర్, ఆర్‌బికె, నాడు నేడులో పాఠశాల భవనాలను ప్రారంభించారు. వియ్యంపేటలో సచివాలయం, ఆర్‌బికె, మండల కేంద్రంలో కొత్తవలస -1 సచివాలయ భవనం, దేశపాత్రునిపాలెంలో సచివాలయ భవనం, వెల్నెస్ సెంటర్, ఆర్‌బికె భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జెడ్‌పిటిసి శ్రీదేవి, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, మేలాస్ట్ అప్పారావు, విరోతి కొండలరావు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

'బాబు డాబు మాటలు నమ్మొద్దు'

మెంటాడ: చంద్రబాబు నాయుడు చెబుతున్న డాబు మాటలు నమ్మి మోసపోవద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. మండలంలోని పోరాంలో వైఎస్ఆర్ చేయూత కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మోసం చేశారని, రుణమాఫీ కూడా చేయలేదని గుర్తు చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా పుట్టిన బిడ్డకు రూ.25 వేలు జమ చేస్తానని చెప్పి చేయలేదని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి ఇవ్వలేదని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత 99 శాతం హామీలను నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, నాయకులు లెంక రత్నాకర్, చెల్లూరు సుధీర్, దాట్ల హనుమంతరాజు, రాయిపిల్లి రామారావు, అధికారులు, సర్పంచులు, పాల్గొన్నారు.

ఇపిఎఫ్ పోరాటక కమిటీ ధర్నా

గరివిడి: ఇపిఎఫ్ పెన్షన్ కనీసం రూ.7,500, డిఎ, పెన్షన్ దారులకు ఉచిత వైద్యం అందించాలని కోరుతూ దేశవ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద చేసిన ధర్నాలో భాగంగా సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆ సంఘం సభ్యులు ధర్నా చేపట్టారు. అనంతరం మండల డిటికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎ. గౌరినాయుడు, జై విశ్వనాథరాజు, తాళ్లపూడి సత్యం, సలీం, ఒ.ఎస్.ఎన్ మూర్తి, గంటే అప్పలరాజు, కరణం సన్యాసినాయుడు, ఎస్.పాపి నాయుడు, శనపతి రమణ పాల్గొన్నారు.

13న యువభేరి బహిరంగసభ

విజయనగరం టౌన్: ఈనెల 13న నగరంలో నిర్వహించనున్న యువభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి యువజన నాయకులు బంగారు నాయుడు, ఈశ్వర్ కౌశిక్, అల్లు చాణక్య పిలుపునిచ్చారు. సోమవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సభకు రాష్ట్ర వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో సిఎంఆర్ జంక్షన్ నుంచి మూడు లంతర్ల వరకు యువజన విభాగం, విద్యార్థి విభాగం శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

ప్రజాశక్తి - వేపాడ

విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మండలంలోని ప్రభుత్వ వసతి గృహాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పబ్లిక్ పరీక్షలకు అవసరమైన ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్, ఎరేజర్ వంటి సామగ్రిని సోమవారం అందించారు. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో 74 మందికి, వావిలిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గురుకు, ఎన్‌కెఆర్‌పురంలో 26 మందికి, కెజిబివి వసతి గృహంలో 44 మందికి, ఎపి ఆదర్శపాఠశాలలో 97 మందికి, వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 62 మందికి, సోంపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 42 మంది విద్యార్థులకు, కొండగంగుపూడి గిరిజన ఆశ్రమ పోషక గృహంలో 36 మందికి, బొద్దాం పాఠశాలలో 13 మందికి ఈ సామగ్రిని అందించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఇష్టపడి, కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను రాబట్టగలమన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్, కిరణ్మయి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మండల బిసిపి అధ్యక్షులు సేనాపతి గణేష్, నాయకులు జనరేట్ ఈశ్వరరావు, సిరికి రమణ, గొర్లె నాగరాజు, మించిన అప్పలనాయుడు, ముక్క రామకృష్ణ, కోటాన ప్రసాద్, చామలాపల్లి జగన్, పల్లె ధనుంజయ, గుమ్మడి రాంబాబు, గుమ్మడి రవి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: పదోతరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు వంటి స్టేషనరీని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని కొట్యాడ, గోలజాం, లక్కవరపుకోట, గంగుపూడి, కల్లేపల్లి, చందులూరులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యటించి పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తన వంతు ప్రోత్సాహం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జక్కాన కన్నబాబు, గనివాడ సతీష్, గేదెల అర్జునరావు, గనివాడ రాము, గనివాడ దేముడు, దాసరి గౌరీశంకర్, గనివాడ రాజు, ప్రసాద్, చలుమూరి వృద్ధి, గేదెల మోహన్, రంగలి నవీన్, లక్ష్మణ్, సందీప్ పాల్గొన్నారు.


మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న గొంప కృష్ణ, తదితరులు

జామి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే సదుద్దేశంతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. పరీక్షలు రాసిన ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. జామి, అలమండ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రాసేందుకుగాను ప్యాడ్లు, పెన్నులు, ఇతర స్టేషనరీ మెటీరియల్లను అందజేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లగుడు రవికుమార్, రెడ్డి పైడిబాబు, ఇప్పాక త్రివేణి, రాయవరపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆడది అంటే అబల కాదు అని... సబల అని నిరూపించుకుంటూ అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారని సెంచూరియన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి అన్నారు. సోమవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల గొప్పతనం గురించి వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ నేడు మహిళలు విభిన్న రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళల పట్ల మగవాళ్ల ఆలోచన ధోరణి మారాలన్నారు. డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, మగవారితో సమానంగా వేతనాలు పొందగలుగుతున్నారని కొనియాడారు. ప్రొఫెసర్ శాంతమ్మ మాట్లాడుతూ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని తనను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు ప్రతి క్షణం తమ విధులను సక్రమంగా నిర్వర్తించగలిగితే వారు కూడా అన్ని రంగాల్లో ముందంజలో ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కర్మ సిద్ధాంతం గురించి వివరించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని మహిళా సిబ్బందికి రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డాక్టర్ పుష్పలత చేతుల మీదుగా శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ రమణారావు, డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీడియోల్, డీన్ ప్రొఫెసర్ మురళీ, డీన్ డాక్టర్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: పిల్లలకు విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పరచాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఆరోగ్యవంతమైన పౌష్టికాహారం అందించాలన్నారు. పిల్లల భవిష్యత్తు మహిళపై ఆధారపడి ఉందని గుర్తు చేశారు. అనంతరం పలువురు మహిళా ప్రజాప్రతిథులను మహిళ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ ఉమా భారతి, కొటారిబిల్లి గ్రామ సర్పంచ్ వేముల రమణమ్మ, కస్తూర్బా గాంధీ విద్యాలయ ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి, వివిధ శాఖల అధికారులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, మహిళా సంరక్షణ పోలీసులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


నెల్లిమర్ల: సెంచూరియన్ యూనివర్శిటీలో మహిళలను సత్కరిస్తున్న నిర్వాహకులు

శృంగవరపుకోట: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించగలరని వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరుస్తున్న పలువురు మహిళలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ సంతోష్ కుమారి అంగన్వాడీలు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవ ర్యాలీ

తెర్లాం: మండల కేంద్రంలో బాడంగి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవ ర్యాలీ సోమవారం నిర్వహించారు. మండలంలోని నాలుగు సెక్టార్ల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, వెలుగు విఒఎలు ఈ ర్యాలీలో పాల్గొని గర్భిణలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. మండల ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం మోహన్‌రావు, అంగన్వాడి సూపర్‌వైజర్ చిట్టెమ్మ, ఉషారాణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మెరకముడిదాం: మండలంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ చీపురుపల్లి ప్రాజెక్ట్ అధికారి కెవిఎస్‌ఆర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో పౌష్టికహార పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకురాలు శ్రీదేవి, ఎన్ జిఒ ప్రతినిధి జానకి, ఎపిఎం ఉమామహేష్ పాల్గొన్నారు.

కొత్తవలస: మహిళలు అన్ని రంగాల్లో ముందున్నప్పుడే సమాజం ముందుకు వెళుతుందని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో పోషణ పక్వాడ వారోత్సవాలు, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్. ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపిఒ బి. లక్ష్మీబాయి, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరం: పౌష్టికాహార పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం బొత్సపేట అంగన్వాడి కేంద్రంలో సూపర్‌వైజర్ అనురాధ అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. ఇంటికి ఇనుము వంటికి మినము అనే స్లోగన్ ఉపయోగించి మినుములు ఉపయోగాలు గురించి వివరించారు. రాగులు, జొన్నలు, గంటెలు, సామలు, కొర్రలు ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి, శ్యామల, ఆయాలు పాల్గొన్నారు.

నవ సమాజ స్థాపనకు ఓటు వజ్రాయుధం

ప్రజాశక్తి- బొబ్బిలి

నవ సమాజ స్థాపనకు ఓటుహక్కు వజ్రాయుధమని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. స్థానిక లోకబందు రెసిడెన్సీలో సోమవారం నా మొదటి ఓటు ఆంధ్రప్రదేశ్‌కు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకుంటేనే ప్రశ్నించే హక్కు ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యంలో అవినీతి, అక్రమాలపై ప్రశ్నించాలంటే రాజకీయాలు అవసరమన్నారు. ఉన్నత చదువులు చదివిన యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో ఉపాధి, వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం సర్వనాశనం చేసిందన్నారు. సమాజాన్ని బాగు చేసుకునేందుకు కష్టాలను తీర్చుకుని జీవితాలను బాగు చేసుకునేందుకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిడిపి యూత్ వింగ్ కార్యదర్శి పి.తేజస్విని మాట్లాడుతూ రాష్ట్రానికి సరైన నాయకుడిని ఎన్నుకుంటే యువత, ప్రజలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. సామాజిక సేవ చేస్తున్న బేబినాయనకు మొదటి ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రొఫెషనల్ వింగ్ జోనల్ ఇంచార్జి ఆవాల సతీష్ కుమార్, టిడిపి నాయకులు, మొదటిసారి ఓటు హక్కు పొందిన యువతీ యువకులు పాల్గొన్నారు.



విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతున్న బేబినాయన

గంజాయిపై ఉక్కుపాదం మోపి నివారణ

రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే గంజాయిపై ఉక్కుపాదం మోపి నివారిస్తామని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. కల్తీ మద్యం, గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు వల్ల యువత జీవితాలు నాశనం నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని యువకులు ప్రశ్నించగా కల్తీ మద్యం నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, రోడ్లు బాగు చేయాలని, తాగునీరు, సాగునీరు సమస్యలు పరిష్కరించాలని కోరగా టిడిపి అధికారంలోకి వస్తే ఆయా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'సిద్ధం సభలో జగన్ అబద్దాలు చెప్పారు'

ప్రజాశక్తి- గరివిడి

సిద్ధం సభలో జగన్ అబద్దాలు చెప్పారని, మద్య నిషేధంలో ప్రజలను మోసం చేశారని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. మండలంలోని బిజి పాలెంలో సోమవారం ఆయన ఇంటింటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ మద్యపానం నిషేధం చేస్తానని మహిళలు ఓట్లు వేసుకొని, ముఖ్యమంత్రి అయిన తర్వాత హామీను తుంగలో తొక్కి అత్యధిక రేట్లకు మద్యంను అమ్మి సామాన్య ప్రజలు రక్తం పీల్చారన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తానని నిరుద్యోగ యువతను మోసం చేశారన్నారు. సిపిఎస్ రద్దు చేస్తానని ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేశారన్నారు. విద్యుత్ చార్జీలు తొమ్మిది సార్లు పెంచి రాష్ట్ర ప్రజానీకాన్ని తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారన్నారు. అనంతరం టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల బలరాం, సారేపాక సురేష్ బాబు, ముల్లు రమణ, కొండ్రు లక్ష్మణరావు, లెంక త్రినాధ రావు, పిళ్ళా అప్పారావు, పుర్రి రమేష్, మహంతి సూర్యారావు, వెంకన్న, బోర భాస్కరరావు, దిండి రమేష్, కోరాడ శ్రీను, సబ్బి సింహాచలం, యలమంచిలి బాలకృష్ణ, కడుపుట్ల ఏసు తదితరులు పాల్గొన్నారు.


సూపర్ సిక్స్ గురించి వివరిస్తున్న నాగార్జున

ఘనంగా మహిళా సదస్సు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని శిరికి రిసార్ట్స్‌లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మహిళా సదస్సు కార్యక్రమంలో మాజీ ఎమ్‌పి బొత్స ఝాన్సీలక్ష్మి పాల్గొని మాట్లాడారు. మహిళలకి ప్రాదాన్యత కల్పించిన మన ముఖ్యమంత్రికి మనందరి ఆశీస్సులు అందజేయాలని, ఆశీస్సులు అందజేయాలంటే ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావుని, మీ అక్క చెల్లమ్మనైనా తనను విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా 2024 ఎన్నికలలో గెలిపించి మీ ఆశీస్సులు అందించాలని కొరారు. అనంతరం ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతు ప్రతి మహిళ ఆర్థికంగా బలపడాలని సమాజంలో గౌరవంగా బ్రతకాలన్నా గొప్ప ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నవరత్నాలు పథకాలు అందించారన్నారు. అందులో భాగంగానే చేయూత పథకాన్ని అందిస్తున్నామని గుర్తు చేశారు. అనంతరం బొత్స ఝాన్సీలక్ష్మిని దుస్సాలవాలు, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతి రాణి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, చైర్మన్లు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, వైసిపి మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని పెరుమాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. 40 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ రెండు సంవత్సరాలకు ఒకసారి నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా గ్లకోమా వ్యాధి ద్వారా సంభవించే అందత్వం నుండి దృష్టిని కాపాడుకోవచ్చని వైద్యాధికారి డాక్టర్ మనోజ్ఞ అన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు సందర్భంగా జిల్లా అందత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో అవగాహన కల్పించామన్నారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్. వసంతరావు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు వివరిస్తు, నేత్ర పరీక్షలకు నేత్ర వైద్యులను సంప్రదించి నపుడు, కంటిలో గ్లకోమా వ్యాధి లక్షణాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకోవాలని సూచించారు. గ్లకోమా అనేది కుటుంబ చరిత్ర కలవారికి, చక్కెర వ్యాధి కలవారికి, గాయాలు బారిన పడిన వారికి, వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. 55 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, వారిలో 22 మందికి కంటి శస్త్ర చికిత్సలు కోసం పుష్పగిరి కంటి ఆసుపత్రికి పంపించామని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, సామాజిక ఆరోగ్య అధికారి పుష్పలత, పర్యవేక్షకులు భవానీ, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమిదే విజయం : గద్దె

ప్రజాశక్తి- చీపురుపల్లి

వచ్చే లోక్‌సభ, శాశన సభ ఎన్నికలలో ఎన్‌డిఎ కూటమిదే విజయమని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు జోష్యం చెప్పారు. ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పొత్తులతో ప్రజల కోరిక నెరవేరిందన్నారు. ప్రజల రక్షణ, వైసిపి అవినీతి పాలన అంతం కోసమే కూటమి ఏర్పాటైందన్నారు. వైసిపి పాలనలో దాడులు, అరాచకాలు, అవినీతి, రౌడీయిజం, అక్రమాలు ఎక్కువ య్యాయన్నారు. వాటన్నిటినీ అరికట్టి ప్రజలను రక్షించడం కోసం కూటమి తప్పదన్నారు. కూటమి ఏర్పాటులో పవణ్‌కళ్యాన్ పాత్ర కీలకంగా ఉందన్నారు. ఎక్కడ నెగ్గాలో ఎక్కడ తగ్గాలో కూడా పవన్ తన వ్యవహార శైలి ద్వారా ప్రస్ఫుటంగా కనిపించిందన్నారు. ప్రస్తుతానికి రాష్ట్రం చాలా గడ్డు పరిస్థితులలో ఉందన్నారు. ఈ నెల 17న జరిగే సభకు ప్రధానమంత్రి మోడీ రావడం చాలా సుభ పరిణామమని ఆయన అన్నారు. ప్రస్తుతం పోలీసులు ఒక వైపు మాత్రమే కొమ్ము కాస్తున్నారని రెండవ వైపు కూడా చూడడానికి కొంచెం సమయం పడుతుందని చెప్పారు. 17వ తేదీన జరిగే సభలో పోలవరం నిర్మాణం, అమరావతి రాజధాని నిర్మాణం వంటి వాటిపై మోధీ మాట్లాడే అవకాశం ఉందని అన్నారు.

కస్తూరిబా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మెంటాడ

మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల విద్యార్థులు ప్రతిభకు పట్టాలు లభించాయి. ఇటీవల విజయవాడలో జరిగిన సమతా హిందీ ప్రచార విభాగ్ పరీక్షల్లో 52మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో స్థానిక కస్తూరిబా పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న టి.గాయత్రి ప్రతిభ కనబరిచి బంగారు పతకం, పదో తరగతి చదువుతున్న బి.సుజాత కాంస్య పతకం సాధించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో మరో 10 మందికి సర్టిఫికెట్లు కూడా లభించాయని పాఠశాల ప్రిన్సిపాల్ శారద, హిందీ ఉపాధ్యాయులు బివిఎల్ దివ్య తెలిపారు.